# "నాగరికత నవ్వుతోంది"

"హాయ్" అంటూ వినవచ్చిన ఆవులింత శబ్దానికి, అప్పుడే బెడ్ రూం గుమ్మంలో అడుగెట్టబోతున్న సుధాకర్ తలెత్తి చూచాడు.

గాడ్రేజ్ డబుల్ కాట్ మీద భాసింపట్టు వేసుకూర్చునివుంది శాంతి కళ్ళు మూసుకుని. నొక్కులు తిరిగిన బాబ్డ్ హేర్ రేగి, ముఖమూ, చెవులూ, చెంపలూ, అంతా ముసురుకుని వుందా పొట్టిజుట్టు. బద్ధకంగా మూస్తూ, తెరుస్తూ వున్న కాటుకలేని కళ్లు మరింతగా చికిలించుకుపోయి, ఆ పెద్దముఖంలో ఏనుగుకళ్ళలా వికారంగా వున్నాయి. ఆవులిస్తున్నపుడు తెరచిన ఆమెనోరు, చెరగిన లిప్‌స్టిక్ పెదాలతో, సింహిక నోరులా, గుహలా అసహ్యంగా వుందనిపించిందతగాడికి.

"హాయ్, ఏమిటలా చూస్తున్నావు ?" విడీ విడని కనురెప్పలు బలవంతంగా విడదీసుకుంటూ, భర్తకేసి తమాషాగా చూస్తూ అడిగింది.

"నిన్నే !" మనసులో రేగుతున్న అసహ్యాన్ని అదిమిపెట్టుకుంటూ నవ్వురాని పెదవులతో నవ్వబోతూ అన్నాడు సుధాకర్.

"నన్నా ? ఏం ? అంత బావున్నానా ?" అంతటి మహాకాయాన్నీ కుదుపుకుంటూ సిగ్గు అభినయించటంతో బెత్లిన్‌షమిట జారి పక్కమీద పరుచుకుంది. స్లీవ్‌లెస్ లోనెక్ జాకెట్‌లోనుంచి పైకి కనిపిస్తున్న బ్రాసరీతోబాటు .... పూతనలా....ఛీ....చప్పున ముఖం త్రిప్పుకున్నాడు సుధాకర్, వెనుదిరుగుతూ.

"వెళ్తున్నావా ఏమిటి ? టిఫిన్ పుచ్చుకొన్నావుగా ? అలావెళ్తే నా ఫ్రెండ్ "జాన్" నోసారి రమ్మనిచెప్పు. మాక్లబ్బుకు సంబంధించిన ప్రోగ్రాం ఒకటి చెప్పాలతగాడికి....అబ్బ ! నిద్రవస్తోంది. మరి కాస్సేపు

పడుకుని లేస్తాను....శాంతి బద్ధకంగా పలుకుతున్న పలుకులు, ములుకుల్లా అతగాణ్ణి తరిమివేస్తున్నాయి. వడివడిగా నడుస్తున్న అతగాడు గేటు సమీపిస్తుండగా, వెనుకనుంచి డ్రైవర్ మంగయ్య వగరుస్తూ పరుగెత్తుక వచ్చాడు.

"బాబుగారూ ! బాబుగారూ ! తమరు రావటం చూళ్ళేదు నేను.... క్షమించండి. ఒక్క క్షణం ఆగండి షెడ్‌లోనుంచి కారు తెస్తాను" తన పొరబాటుకు ఉద్యోగం వూడిపోతుందేమో నన్న భయంతో అతగాడు ఆపాదమస్తకం గజగజ వణికి పోతున్నాడు.

వెనుదిరిగి అతగాడివేపు చూశాడు సుధాకర్. వయసుమళ్ళినా, తన కర్తవ్య పాలనలోగానీ, విశ్వాసంలోగానీ, వినయ విధేయతలలోగానీ ఏ క్షణమూ లోపం రానివ్వని మంగయ్య, ఈమధ్య చాలా మారిపోయాడు. పరధ్యాన్నం, నిర్లక్ష్యం ఎక్కువైతున్నాయి అతగాడిలో. నిజమే మరి ! ఇంటి యజమానురాలిలో తన బాధ్యత మరుపుకువస్తే, నౌకర్లలోనూ బాధ్యతారాహిత్యం పెరిగిపోవటంలో ఆశ్చర్యమేముందీ ?

"వద్దు మంగయ్యా ! అలా నడిచే వెళదామనుకున్నాలే !" గేటు దాటి గబగబ అడుగులువేశాడు సుధాకర్. ఈ రోజెందుకో ఇలా సిటీ అంతా నడిచి నడిచి అలసిపోవాలనిపిస్తోంది. ముందుగా చిల్డ్రెన్స్ నర్సరీ వేపు వెళదామనిపిస్తోంది .... అక్కడ ఐదేళ్ళ రవి, మూడేళ్ళ లలిత వున్నారు. తనని చూడగానే వాళ్ళిద్దరూ పరుగెత్తుకవస్తారు.... "నాన్నా ! నాన్నా !" అంటూ తనను పెనవేసుక పోతారు. వచ్చీరాని మాటలతో లలిత ఏమేమిటో చెప్పాలని ఆరాటపడ్తుంది. రవి ఒకటే కబుర్లు.

"నిన్న, ఆయా చెల్లాయిని కొట్టింది నాన్నా !" అంటాడు. రవి.

"ఎందుకూ ?" తన హృదయం బాధతో గిలగిలలాడి పోతుందా క్షణంలో.

"త్వరగా నిద్రపోకుండా .మేలుకుందని .... మొన్న నన్ను తొడపాశం పెట్టింది కూడాను."

వీళ్ళు తన పిల్లలు ! తను, శాంతి ధర్మబద్ధంగా కన్నబిడ్డలు. కానీ తామిద్దరూ బ్రతికివుండి అనాథల్లా పెరుగుతున్న పిల్లలు ! కారణం తన అసమర్థతా ? శాంతి నాగరికతా ? వీళ్ళ ఖర్మా ? ఏమో ? రోజూ తనలో ఇవే ప్రశ్నలు చెలరేగుతున్నాయి. సమాధానాలు దొరకటంలేదు. కానీ ఈనాడు వాటికో సమాధానం తెలుసుకోనిదే .... బిడ్డలను తన దగ్గరనే చేర్చుకోనిదే, ఇక నిద్రపోడు.... అంతే.... అసలెందుకయ్యిందిలా ?

చిల్డ్రెన్స్‌నర్సరీలో అడుగెట్టాడు .... చుట్టూరా ఎందరో అనాధలు. వారిలో కొందరు నిజమైన అనాథలు. కానీ మరికొందరు .... చాలా ఎక్కువమంది తన రవి, లలితల్లాటి తలిదండ్రులున్న అనాథలు.... నాగరికత పేరుతో తలిదండ్రులకు దూరంగా వుంచబడిన పిల్లలు, క్రమశిక్షణ పేరుతో నిర్దాక్షిణ్యంగా మాతృపితృప్రేమనుంచి వంచితులైన అభాగ్యులు.

"నాన్నా ! నాన్నా !" రవి, లలిత పరుగెత్తుకు వచ్చారు.

"నాన్నా !" ఆ పిలుపు తర్వాత ఎన్నో ముద్దుకబుర్లు, కనీసం ఇది విని ఆనందించాలనేనా లేదా శాంతికి ? శాంతి ఆడదా ? కాదు. పిశాచి,తన పాలిటి పిశాచి. అవును తన జీవితాన్ని అశాంతిపాలుచేసిన రాక్షసి....

"నాన్నా ! రోజూ వస్తావుగా !" రవి బ్రతిమాలాడు రోజూలానే.

"నాన్నా ! చాకలెత్తు రోజూ తెస్తావా ?" లలిత ముద్దుగా అడుగుతోంది. గబుక్కున ఇద్దర్నీ హృదయానికి హత్తుకున్నాడు.

"....సాయంత్రం వస్తాను నాన్నా. కారులో మిమల్నిద్దర్నీ నావెంట తీసుకవెడతాను .... మనందరం హాయిగా వుందాం !" ఆర్ద్రమైన కంఠస్వరంతో ఆవేశంగా అన్నాడు సుధాకర్.

దుద్దులతో వున్న శేషమ్మ తనకేకాదు, తన అమ్మ, నాన్నగార్లకు కూడా మహాలక్ష్మిలా కనిపించేది!

తెల్లవారుఝామున లేచి సుధాకర్ తండ్రిగారు పూజచేసుకొనేవారు. శ్రద్ధగా శేషమ్మ తనూ నియమంగా స్తోత్రాలు వల్లించేది. ఇంటిపనులు చూచుకుంటూ, చిరునవ్వులు చిందిస్తూండేది....

హైద్రాబాదుకు పిల్చుకువచ్చాడు సుధాకర్....త్రోవలో ట్రెయిన్‌లో శేషమ్మ పేరు "శాంతి"గా మార్చేశాడు! అదొక్కటే తను చేసిన పెద్ద తప్పేమో?

"శేషమ్మ బాగాలేదా?"

"ఊహూఁ! సిటీలో వుంటాం మనమిక. ఈ పాత పేర్లు బావుండవు!"

అంతే, ఇక శేషమ్మ శాంతిగా మారింది. ఆమెలో రోజురోజుకూ మార్పులు రావటం మొదలెట్టాయి. నడక, నవ్వు, కట్టు, బొట్టు సుధాకర్ ప్రమేయం లేకుండానే మారిపోయాయి. పొడుగుపాటి జడ, రెండు జడలుగా మారింది. కాటుక పెట్టుకోవటం బొత్తుగా మానేసింది. ఫ్యాషన్ కాదని బొట్టుకూడా ఒక్కోసారి మానేసేది. ఇంగ్లీషు, ఉర్దూ బాగా ధారాళంగా మాట్లాడగలుగుతోంది....

రెండేళ్ళలో శాంతిలోలానే, సుధాకర్ జీవితంలోనూ పెద్ద మార్పు వచ్చేంది. ఓ స్నేహితునితో కలిసి వ్యాపారం పెట్టుకుందా మన్న ఆలోచన అతగాడికి వచ్చింది. ఇద్దరి వాటాల డబ్బూ ఆ స్నేహితుడే పెట్టుబడి పెట్టాడు. మరో సంవత్సరానికే ఇద్దరూ వేలు సంపాదించారు. ఐదేళ్ళలో లక్షాధికారులయ్యారు. ఇద్దరి మకాంలూ బొంబాయికి మారాయి. కారూ, బంగళా వచ్చాయి. ఖరీదైన జీవితం మొదలైంది. శాంతిలోనూ

చాలా మార్పు వచ్చింది. ఆమె ఇప్పుడు ఓ క్లబ్బు సెక్రటరీ! పేరున్న వనిత ఆమె. ప్రోగ్రాంలతో ఆమె బిజీగా తయారైంది.

శాంతిగా మారిన శేషమ్మలోని చాలా మార్పులను సుధాకర్ సహించగలిగాడు గానీ, ఆమె అస్తమానూ బయట తిరుగుతూ, గృహ బాధ్యతల్ని విస్మరిస్తుంటే మాత్రం సహించలేక పోయాడు.

"నువ్వు గృహిణివి శాంతీ! ఈ గృహ బాధ్యతలు నీవు చూచుకోవాలి.... అన్ని బాధ్యతలూ నౌకర్లమీద పడేసి వెళితే, వాళ్ళెందుకు సరిగా చేస్తారూ!" అంటూ మందలించాడారోజు.

"నీదంతా చాదస్తం. వాళ్ళెందుకు చూడరు?" అంది నిర్లక్ష్యంగా నవ్వుతూ. సుధాకర్ క్షణకాలం నిర్ఘాంత పోయాడు....

"నీది!" ఏకవచన ప్రయోగం....

"ఏమిటిది శాంతీ! నన్ను నువ్వు అంటే బావుంటుందా?" తీక్ష్ణంగానే అడిగాడు.

"ఎందుకు బావుండదు? నన్ను నువ్వు అనటంలే!" కిల కిల నవ్వింది శాంతి.... "కాలం మారిపోయింది సుధాకర్! మారిపోతుంది. అలాచూడు. సొసైటీలో భర్తను మీరు అనే భార్య లెంతమంది వున్నారీనాడు? అలా అంటే అమ్మమ్మలనే అనుకోవాలి. కాకున్నా సంబోధన దగ్గర ఇంత పట్టుదలేమిటి మనలో మనకు. ఇంగ్లీషులో "నీవు, మీరు" అనే రెండుమాటలకూ వుపయోగించే వర్డు "యూ" అని మర్చిపోయావా ఏమిటి?" శాంతి చేసిన ఆ తర్కం వెనుక ఏ నాగరికతా ప్రభావం, ఎంత హెచ్చు పాళ్ళలో వుందో గ్రహించిన సుధాకర్ సమాధానం చెప్పలేకపోయాడు.

శాంతి కిప్పుడు ఉదయం ఎనిమిదిన్నర గంటలు దాటాక తెల్లవారుతోంది. ఒక్కొక్కసారి తొమ్మిదికి. ఉదయాన్నే లేచి తను కాఫీ, టిఫిన్లూ

కథా నిలయం
4823

వంటమనిషి తెచ్చిస్తే, తీసుకుని వ్యాపారం గొడవల్లో పడతాడు. ఒక్కో రోజు వంటమనిషి, నౌకర్లూకూడా ఆలస్యంగా లేచేవారు. అదేమని కేకలు వేశాడు తను. చాటుగా వాళ్లు విసుక్కోవడమూ చెవులారా విన్నాడుతను. "అయ్యగారంత పెందరాళే ఎందుకో నిద్రలేవటం ? హాయిగా అమ్మగారికి మల్లే కాస్త ఆలశ్యంగా లేవకూడదూ ? మనమూ కాస్సేపు నిద్ర పోవచ్చుగా ?" అని.

ఒక బాచ్ నౌకర్లను తొలగించి క్రొత్తవారిని పెట్టాడు. వాళ్లూ నాలుగురోజులు పోయాక, పై తత్వానికే తిరిగారు.

తాపీగా నిద్రలేచిన శాంతి స్నానం, టాయిలెట్ ముగించుకొ, ఏ క్లబ్బుకో వెళుతుంది. ఆవిడలాటి ఆడవారే చాలామంది పోగయ్యారు. ఆ వెళ్ళటం మధ్యాహ్నం ఏ మూడుగంటలకో వస్తుంది. మళ్ళీ కాసేపు విశ్రాంతి, తిరిగి తిరిగీ ఏదో ఓ ప్రోగ్రాం. ఒక్కోసారి ఫ్రెండ్స్‌తో సినిమాలకు వెళ్ళి ఏ రాత్రికో వస్తుంది.

రాను రాను తామిద్దరిమధ్యా, భార్యాభర్తలమధ్య వుండవలసిన అనురాగం మృగ్యమై ఒకే కంపార్టుమెంటులో కూర్చుని వుండే ఇద్దరు ప్రయాణీకుల లాటి అనుబంధం మాత్రమే పెరుగుతోంది. ఎప్పుడో భౌతికమైన వాంఛలు చెలరేగినపుడు, పరస్పరం భార్యాభర్తలమన్న అనుభూతి కలగటం మినహా మరే అనుబంధమూలేదు.

హఠాత్తుగా ఓ రోజు బాబ్‌డ్ హేరుతో ఇంటికి వచ్చిన శాంతిని చూచి నిర్ఘాంతపోయాడు సుధాకర్. "ఇదేమిటి శాంతీ ? నీ జడ ?" అంత నిడుపాటి జడ ఎందుకు కత్తిరించుకుందో ?

"....అవును నా జడ కత్తిరించేసుకున్నాను. అసలు ఇక్కడికొచ్చినప్పట్నుంచీ అనుకుంటూనే ఉన్నాను. బర్రెతోకల్లా వెధవజడల్లా-

దువ్వుకోవటం ఓ గంట పడుతోంది. చక్కగా బాబ్డ్ హేర్ అయితే బావుంటుందని ఈరోజు నేనూ, లీలాప్రసాద్, సవిత ముగ్గురం సెలూన్‌కు వెళ్ళి బాబ్డ్ హేర్ చేయించుకువచ్చాం. హాయిగావుందినాకు!" డ్రస్సింగ్ టేబిల్‌ముందు కూర్చుని బాబ్డ్ హేర్ అందాన్ని తనివిదీరా చూచుకుంటున్న శాంతికేసి చూస్తున్న సుధాకర్ హృదయంలో మొదటిసారిగా ఆమెపట్ల "అసహ్యం!" అన్నభావం తలెత్తింది. బాగా ఒళ్లువస్తోంది శాంతికి....

శాంతి గర్భిణీగా వుంది. ఎలాగో డాక్టర్ సలహామేరకు ఇంటి పట్టునే వుంటోంది. తీరా పురుడు వచ్చే ముందుగా పెద్ద పేరున్న నర్సింగ్‌హోమ్‌లో చేర్పించాడు సుధాకర్.

మరునాడే సుఖంగా ప్రసవించింది శాంతి .... బొద్దుగా, తెల్లగా, చక్కగా ఉన్న బాబుకు "రవి" అని పేరెట్టాలని కూడా నిర్ణయించుకున్నారిద్దరూ!

మూడోరోజు నర్సింగ్‌హోమ్‌కు వెళ్ళి శాంతి ఉన్న రూంలో అడుగెడ్తున్న సుధాకర్‌కు బాబు అంతగా ఏడవటం ఎందుకో అర్థం కాలేదు.... శాంతి ఓదార్చలేక ఆయాను కేకేసింది.

"ఎందుకు సిస్టర్, బాబు అలా ఏడుస్తున్నాడు?" అన్నాడు సుధాకర్ కంగారుగా.

అనుభవశాలియైన ఆ సిస్టర్ నవ్వింది. "మీ కంత కంగారెందుకు బాబూ? పాలకోసం ఏడుస్తున్నాడు .... ఈ రోజు మూడోరోజు కదూ? ఈ మూడురోజులుగా ఆ బిడ్డ కడుపులోకి తల్లిపాలు పోలేదుగదూ? మధ్యాహ్నం బ్రెస్ట్‌మిల్క్ ఇప్పిస్తాం! అంతే ఇక మీ బాబు మీరు ఏడవమన్నా ఏడవడు!" నవ్వుతూ వెళ్ళిందామె.

"బ్రెస్ట్‌మిల్క్!" ఆ మాట తియ్యగా చెవుల్లో ప్రతిధ్వనించింది సుధాకర్‌కు మళ్ళీ మళ్ళీ....

తన పెళ్ళైన కొత్తల్లో.... శేషమ్మ కాపురానికి రాక ముందు, తను తన ఫ్రెండ్ రాఘవ ఆహ్వానంపై అతడి తొలి కొడుకు బాలసారెకు వెళ్ళాడు. కానీ రాఘవ మాత్రం అస్తమానం తన భార్య గదివిడిచి బయటికి వచ్చేవాడుకాడు. తనకు బోర్ అనిపించేది.

అదేమంటే రాఘవ నవ్వేవాడు. "నీకింకా అనుభవంలోకి రాలేదుగా ఈ తియ్యదనం! అంచేత నీకు విసుగుగానే ఉంటుంది!" అన్నాడు.

"ఏమిటో అంత తియ్యదనం?" కుతూహలంగా అడిగాడు తను.

"బాబుకు మా ఆవిడ పాలిచ్చేదృశ్యం నాకెంతో హాయిగా వుంటుంది. గంటల తరబడి అలాగే చూస్తూ కూర్చోవాలనిపిస్తోంది!"

సుధాకర్ విచిత్రంగా చూచాడు రాఘవవేపు.

"అవును సుధాకర్! ప్రపంచంలోని సర్వ ఐశ్వర్యాలనూ గెలుచుకున్నట్లుగా తృప్తితో హాయిగా నిమీలిత నేత్రాలతో పాలుతాగుతుండే బాబునూ, తనలోని అమృతాన్నంతా బాబుకు స్తన్యంద్వారా పంపిస్తూ, అనిర్వచనీయమైన ఆనందంతో పులకించిపోయే - తల్లిగా పరిపూర్ణత్వం పొందిన, మా ఆవిడనూ అలా గంటల తరబడీ చూస్తూ కూర్చోవాలనిపిస్తుంది నామటుకు నాకు" అన్నాడు రాఘవ....

ఈ నాడు తనూ ఆ తియ్యదనమేదో చూడబోతున్నాడు.

"ప్లీజ్ మీరు కాస్త బయటికి వెళ్ళండి. ఆమెగారికి బట్టలు మార్పించాలి!" అన్న సిస్టర్ కంఠస్వరంతో, బయటికివచ్చాడు సుధాకర్.

కానీ ఆ మధ్యాహ్నం తను చూచిన దృశ్యంతో నిర్విణ్ణుడైనాడు సుధాకర్. రబ్బరు పీకెకు తేనెపూసి చీకటం అలవాటు చేయిస్తోంది బాబు చేత ఆయా! ఆ పసిబిడ్డ ఆ పీకె కాస్సేపు చీకి, అప్పుడప్పుడూ "ఓక్" అంటూ డోక్కుంటున్నాడు....

"ఏమిటిది ?" ఆశ్చర్యంగా అడిగాడు సుధాకర్ ! శాంతిలో పాలు లేవా ? అన్న ఆందోళనా కలిగింది.

"మీ బాబుకు పోతపాలు పొయ్యటానికి.. .అలవాటు చేస్తున్నాను!" రుసరుసలాడుతూ అంది అనుభవశాలియైన, నలుగురు బిడ్డల్ని కనిపెంచిన ఆయా.

"అదేం ?"

"మీరిలారండి" నిద్రపోతున్న శాంతి నిద్రకు భంగం కలక్కుండా రూం బయటకు పిల్చుకువచ్చింది ఆయా.

"ఏం చెయ్యమంటారు బాబూ ? ఆవిడగారు బాబుకు ససేమిరా పాలివ్వనని పట్టుబట్టారు. మిల్క్ డ్రై అప్ కావటానికి మందులివ్వమని దాక్టర్‌గారి నడిగారావిడ ! ఆవిడ పోరుపడలేక డాక్టర్ ఇస్తామన్నారు కూడాను. ఏం చేస్తాం ! కొందరు తల్లులకు స్వతహాగా పాలు పడక, బిడ్డలకు పోతపాలు అలవాటు చేస్తారు.... మరికొందరు సమృద్ధిగా పాలు పట్టిస్తామంటారు.... అది ఆ బిడ్డలు చేసుకున్న ఖర్మ ?" ఆ పెద్ద ఆయా గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

సుధాకర్‌కు శాంతి మనస్తత్వం దుర్భరంగా తోచింది. గబగబ రూంలోకి వచ్చాడు. అప్పుడే నిద్రలేచిన శాంతితో మెల్లగా అన్నాడు "బాబుకు పాలివ్వు శాంతీ ! పాపం ఏడుస్తున్నాడు !"

శాంతి బద్ధకంగా నవ్వింది "ఇందాకేగా కాసిన్ని పాలు పట్టింది ఆయా !"

"నీ పాలివ్వు ! నీకు సిగ్గుగా ఉంటే నేను బయటికి వెళతాలే !" నవ్వు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ అన్నాడు సుధాకర్.

"ఇది మరీ బావుంది .. సిగ్గేమిటి ? సిగ్గుకాదు...."

"మరి ?"

"డోంట్ బీ సిల్లీ ! బాబుకు నేను పాలివ్వటమేమిటి ? నేను 'వీక్' అయిపోనూ ? ఎ సింగిల్ డ్రాప్ ఆఫ్ బ్రెస్టు మిల్క్ ఈజ్ ఈక్వల్ టు హండ్రెడ్ డ్రాప్స్ ఆఫ్ బ్లడ్. పైగా పాలివ్వటం అలవాటు చేశామూ అంటే, ఇక వాడు అస్తమానూ నన్ను వదలడు. అదో న్యూసెన్సుగా ఉంటుంది. అదీగాక .... మరో రహస్యం చెప్పనా ? ఇలా బిడ్డలకు పాలిస్తే తల్లుల అందం త్వరగా చెడుతుంది."

సుధాకర్ శాంతికేసి క్షణకాలం చిత్రంగా చూశాడు. ఈమె స్త్రీయేనా ? తను కన్నబిడ్డకు తను పాలిస్తే బలహీనం అవుతుందనుకునే స్త్రీ తల్లేనా ? అలాటి తల్లులే అందరూ అయితే, ఎముకల గూళ్ళలా ఉండీ, తమ సంతానానికి పాలు ఇచ్చే తల్లుల మాటేమిటి ? తన అందం ముఖ్యమా ? బిడ్డ పోషణ ముఖ్యమా ? ఛీ .... శాంతి .... తల్లికాదు, స్త్రీ కాదు, ఏదో ఏదో ? శాంతిపట్ల పెచ్చుపెరుగుతున్న అసహ్యం ఆవిరిలా మారి, నిట్టూర్పుగా బయటికి వచ్చింది సుధాకర్ కు.

రవికీ మూడో ఏడు వచ్చీ రాగానే, వాడిని చిల్డ్రెన్స్ నర్సరీలో చేర్పించింది శాంతి.

"ఇంట్లో ఆయా ఉంది. ఇక బాబు నెందుకలా దూరంచేస్తావు ?"

"వాడికి క్రమశిక్షణ అలవడాలి."

ఇద్దరిమధ్యా వాగ్యుద్ధం జరిగింది. కానీ ఏం లాభం ?

"నాగరికత మీకు తెలీదు" అనేసింది శాంతి కోపంగా !

అవును ... ఈ నాగరికతేమిటో, ఇదెలా పరిణమిస్తుందో తనకు తెలియటంలేదు.... చక్కగా వున్న జుట్టు కత్తిరించుక, శిఖండల్లే బాబ్డ్ హేర్ తో తయారుగావటం నాగరికతా ? ఇంటి బాధ్యతలను విస్మరించి, క్లబ్బులతో, కాలక్షేపాలతో పొద్దుపుచ్చుకోవటం నాగరికతా ? కన్నబిడ్డకు

పాలువుండీ, పాలు ఇవ్వకుండా పాలు డ్రైఅఫ్ చేసుకోవటం నాగరికతా ? చివరకు అష్టైశ్వర్యాలూ వుండీ, బిడ్డను అనాధలా దూరంగా విసరి వేయటం నాగరికతా ? ఇదేనా నాగరికత ? ఇదా ప్రగతి ? రాను రాను శాంతి, సుధాకర్‌ల మధ్య దూరం రోజురోజుకూ ఎక్కువైపోతోంది. లలిత పుట్టడమూ, ఆ పాప విషయంలోనూ శాంతి చూపిన ఉదాసీనతా, లలిత సంవత్సరం నిండీ నిండగానే చిల్డ్రెన్స్ నర్సరీలోకి త్రోయ బడటముతో, సుధాకర్‌కు శాంతి అంటే జుగుప్స బయల్దేరింది....

మనిషి ఊరిపోతోంది. పర్వతంలా ఉన్న శాంతి ఇప్పుడిప్పుడే కొద్దికొద్దిగా త్రాగుడు అలవర్చుకొంటోంది. అదేమంటే.... "నలుగురూ నవ్వుతారు. అమ్మమ్మ కబుర్లు చెప్పకు. నాగరికత మారుతోంది. మనమూ మారాలి. నీ చేతగాకుంటే నువ్వు మారకు. నేను మారితీరుతాను !" అంది.

ఈ నాగరికత ఎందాకా పెరిగింది ! ఈ దేశపు స్త్రీలు త్రాగుడుకు ఎగబడేంతవరకూ పెరిగిందా ? పరపురుషులతో వెకిలిగా డాన్సులు చేసేంత వరకూ పెరిగిందా ?

"బాబుగారూ ! అమ్మగారు ఈ చీటీ మీకిమ్మన్నారు !"

త్రుళ్ళిపడ్డాడు సుధాకర్. తనిందాకా గతం ఆలోచిస్తూ నడుస్తూ.... ఇంటికేవచ్చాడా ? ఎలా రాగలిగాడు ? ఎదురుగా డ్రైవర్ మంగయ్య చేతులుకట్టుక నిల్చుని వున్నాడు.

కాగితం మడత విప్పి చదువుకున్నాడు.

"సాయంత్రం ఐదుగంటలకు డాక్టర్ రమేశ్‌చంద్ర బర్తుడే పార్టీ వుందిట. మా క్లబ్ తరపున ఆయనగారిని అభినందించాలి. అందుకొ్కా వలసిన ఏర్పాట్లు చేసుకోవటానికి నేను వెళ్తున్నాను. బహుశా రాత్రికి రాను. ఫోన్‌లో చిల్డ్రెన్స్ నర్సరీ ఆయా చెప్పింది ! నువ్వు బాబునూ, పాపనూ ఇంటికి తెస్తానన్నావుట. ఎందుకు ? అలా తెస్తే నీకూ నాకూ

సంబంధం తెగిపోతుందని తెలుసుకో .... ఆ న్యూసెన్స్ నేను భరించ లేను...."

ఆ తర్వాత ఏం వ్రాసుందో చదవలేదు సుధాకర్. కాగితం నలిపి ఉండచుట్టి పూలమొక్కల్లో విసిరిపారేశాడు.

"నాకూ నీకూ సంబంధం తెగిపోతుంది". శాంతి బెదిరిస్తోందా ? తను బ్రతిమాలుతాడనుకుంటోందా ? అసలు తామిద్దరి మధ్యా ఉన్న సంబంధ మేమిటి ?

ఇంట్లోకి నడిచాడు. వంటమనిషి భోజనం పట్టుకవచ్చింది గదిలోకి. తినబుద్ధి పుట్టలేదు.

వ్యాపారానికి సంబంధించిన అన్ని కాగితాలూ సరిజూచుకొన్నాడు. క్యాష్ బ్యాలెన్స్ చెకప్ చేసుకున్నాడు. శాంతి పేరిట కొంత బ్యాంకి అకౌంటు సరిజేశాడు. సాయంత్రం ఐదు గంటలు కావస్తుండగా కారు డ్రైవ్ చేసుకుంటూ ధృఢనిశ్చయంతో బయల్దేరాడు సుధాకర్.

వెయ్యి వెలుగులతో రవి, లలిత కారులోకి వచ్చి కూర్చున్నారు. క్షణకాలం ఇద్దర్నీ హత్తుకున్నాడు.

"పదండి వెడదాం !" అన్నాడు సంతోషంగా.

"నా బిడ్డ లీక్షణంనుంచీ నాదగ్గరే వుంటారు. ఓ ఆయాను ఏర్పాటు చేసుకుంటాను .... నా కన్నబిడ్డలు నా కళ్ళెదురుగానే ఉంటారు. వాళ్ళు తల్లిలేనివారైతే కావచ్చు, కానీ తండ్రిలేనివారు కారు. కనీసం పితృ ప్రేమనైనా వారికి మనసారా పంచి ఇస్తాను. ఆ రాక్షసి .... ఆ నాగరికత బలిసిన శాంతి, అది నా కవసరంలేదు. దాని నాగరికతతోనే దాన్ని కులకనీ ! కానీ ఆఖరుసారిగా చెప్పి వెడతాను "ఓ దెయ్యమా ! బిడ్డలు నీకవసరంలేదు. నీకు నాగరికతమాత్రమే కావాలి.నాకు బిడ్డలూ,బాధ్యతలూ,

మమతలూ కావాలి. నాగరికత అవసరంలేదు." ఈ మాటలు చెప్పిమరీ వెళతాను."

లోలోపల నిశ్చయించుకున్న సుధాకర్ శాంతి వాళ్ళ క్లబ్బుకేసి పోనిచ్చాడు కారు.

హాలులో అందరూ స్త్రీలూ, పురుషులూ కలగాపులగంగా తాగుతున్నారు. జంతువుల్లా నవ్వుకుంటున్నారు. ఒకరినొకరు తోసుకుంటూ తొక్కుకుంటూ డాన్స్ చేస్తున్నారు. శాంతి, రమేష్ చంద్ర, ఒకరినడుము ఒకరు పట్టుక పాశ్చాత్య సంగీతాని కనుగుణంగా నాట్యం చేస్తున్నారు. శాంతి కళ్లు ఎరుపెక్కి ఉన్నాయి. బాబ్డ్ హేర్ ఫాన్ గాలికి ఎగురుతోంది. ఆమె ధరించి ఉన్న ట్రాన్స్పరెంట్ బట్టల్లోంచి ఆమె శరీరం అర్ధనగ్నంగా కనిపిస్తోంది.

అందరూ నవ్వుతున్నారు.... అర్థం లేకుండా విరగబడి నవ్వుకుంటున్నారు. ఎవరూ సుధాకర్‌ను గమనించ లేదు. రమేష్‌చంద్ర పెదవులు శాంతి పెదవులను....

గిరుక్కున తిరిగి, కారులో స్టీరింగ్‌ముందు కూర్చున్నాడు సుధాకర్.

"నాన్నా! తొందరగా పోదాంపద నాన్నా! అమ్మవస్తే మమ్మల్ని మళ్ళీ అక్కడికి పంపిస్తుంది'' అంటున్నాడు రవి.

"శాంతీ.... గుడ్‌బై.... ఓ నాగరికతా గుడ్‌బై! ఇలా నాగరికత వెర్రితలలు వేయని మారుమూల ప్రదేశానికి, నాగరికతకు దూరంగా బ్రతకటానికి నేనూ, నా పిల్లలూ వెడుతున్నాం!"

కారు స్టార్టు చేశాడు సుధాకర్. క్లబ్బులోనుంచి నాగరికత విరగబడి నవ్వుతోంది.

("శ్రీమతి'' ఫిబ్రవరి 1969)